# నిధి చాలా సుఖమా?

"మీరు జర్నలిస్టా? అయితే రేపు ఫంక్షన్‌కి మీరు తప్పకుండా ఉండి తీరాల్సిందే!" అన్నాడు డాక్టరు.

"భలేవారు, సార్! ఏదో దారిలో కారు పాడై మీ ఊరిలో దిగబడిపోతే ఇంటికి పిలిచి ఆతిథ్యం ఇవ్వడమూ, కారు బాగు చేయించడమే కాక, రేపటికి కూడా ఉండమంటున్నారు!" అడ్డు చెప్పబోయాడు కిరణ్.

"తక్కినవాటి మాట ఎలా ఉన్నా, ఫంక్షన్‌కి మిమ్మల్ని హాజరవ్వమనడంలో స్వార్థం ఉంది సుమండీ! మా ఊరి గురించి, ఆ ప్రత్యేకమైన ఉత్సవం గురించి ఇప్పటిదాకా ఏ పేపర్లోనూ రాలేదు. మీరు దానిలో పాల్గొని, దాని గురించి ప్రత్యేక కథనంలా రిపోర్టు రాస్తే ఊరు యావన్మందిమీ సంతోషిస్తాం!" అంటూ చేతులు పట్టుకున్నాడు డాక్టరు.

"మీరంతగా చెబుతూ ఉంటే కాదనడం ఎలా? ఇంతకీ దాని బ్యాక్‌గ్రౌండ్ చెప్పండి!" అంటూ పెన్ను, పేపరు బయటకు తీశాడు కిరణ్.

"రేపు జరిగేది యుద్ధవీరుల సంస్మరణ దినం. రెండవ ప్రపంచ యుద్ధంలో మనం సాధించిన విజయోత్సవ వార్షికోత్సవం. ఆ యుద్ధంలో మరణించిన సైనికుల స్మృత్యర్థం ఊరంతా ఒక చోట పోగుపడి, జండావందనం చేసి, మార్చింగు అదీ చేస్తాం."

"ఇలాంటి ఉత్సవం మనం జరుపుకోవడం ఏమిటి? ఇది ఇంగ్లీషువాళ్ల యుద్ధం..."

"అది నిజమే కానీ, మా ఊళ్లో మాత్రమే ఇలాంటిది జరగడానికి కారణం మా ఊరికి చెందిన ముగ్గురు యోధులు ఆ యుద్ధంలో పాల్గొనడం. యుద్ధం నుండి తిరిగి రాగానే మొదలుపెట్టారు. ఆ సంప్రదాయం కొనసాగుతోంది. అందరికీ అదో సరదా. వాళ్లు ఎనభయ్యో పడిలోకి వచ్చినా ప్రతి ఏడాదీ ఇదో సంబరం. ఒకళ్లు విజిల్ ఊదడం, రెండోవాళ్లు పతాకం ఆవిష్కరించడం, మూడోవాళ్లు మార్చింగ్ ఆర్డర్స్ ఇవ్వడం."

"బాగుంది పద్ధతి!"

"ఇంకా వినండి. దీనిలో కూడా ఒక ఆర్డర్ ఉంది. చిత్రమేమిటంటే ముగ్గురిపేరూ ఒకటే వెంకయ్య. అప్పట్లో పేర్ల గురించి పెద్ద తడుముకునేవారు కారేమో! గుర్తుకోసం, వాళ్లని వయస్సులో తేడా బట్టి పెద్ద వెంకయ్య, చిన్న వెంకయ్య, బుల్లి వెంకయ్య అనేవారు. పెద్ద వెంకయ్య విజిల్ ఊదేవాడు. చిన్నాయన పతాకం, బుల్లాయన..."

"పెద్ద వెంకయ్య వయస్సు ఎంత ఉంటుందంటారు?"

"...బతికి ఉంటే...?"

"...పోయాడా? చెప్పారు కారు. వాళ్ల ముగ్గుర్ది ఫోటోలు కలిపి వేద్దామనుకున్నాను."

"క్రితం ఏడాదే పోయాడు. సరిగ్గా ఈ ఫంక్షన్ రోజునే! విజిల్ ఊదుతూ గుండె ఆగి రప్పున కూలిపోయాడు. తమాషా ఏమిటంటే అంతకుముందు రోజునే నా దగ్గరకు వచ్చి చూపించుకున్నాడు. గుండ్రాయిలా ఉన్నాడు. వంద దాటేస్తాడనుకున్నాను. తీరా చూస్తే మర్నాడే... పోస్టుమార్టం చేస్తానని పట్టుబట్టాను. వాళ్ల ఇంట్లో వాళ్లు వద్దు పొమ్మన్నారు. 87 ఏళ్ల ముసలాడు పోవడంలో మిస్టరీ ఏముంటుందంటారు. ఆ నిధి గొడవ ఒకటుంది కదా అన్నా వినిపించుకోలేదు."

"నిధి ఏమిటండోయ్?"

డాక్టరు సిగ్గుపడ్డాడు. "ఏదో మా పల్లెటూరి వాళ్లకు కాలక్షేపం లేక ఏవేవో కబుర్లు చెబుతారు. మీలాంటి వాళ్లు వింటే నవ్వుతారు."

కిరణ్‌లోని జర్నలిస్టు ఊరుకోనివ్వలేదు. "మరి పేపర్లో రాయడానికి ఏదో ఉండవద్దా? 'అభిజ్ఞవర్గాల భోగట్టా' అని కలిపేస్తే ఏం రాసినా చెల్లిపోతుంది. ఏదైనా వింత విషయం ఉంటే చెప్పండి!"

"ఈ ముగ్గురు ముసలాళ్లూ యుద్ధంలో పనిచేసేటప్పుడు, ఏదో నిధి దొరికిందట. దాన్ని ముగ్గురూ కలిసి ఒకచోట దాచారట. అయితే తమలో తాము ఒక ఒప్పందానికి వచ్చారట. తమ ముగ్గురిలోనూ చివరిగా ఎవరైతే మిగులుతారో, వాళ్లు మాత్రమే ఆ ఆస్తంతా అనుభవించాలని ఒట్టేసుకున్నారట. అంత ముసలితనంలో డబ్బు వచ్చినా మాత్రం ఏం చేస్తారో నాకు అర్థం కాదు. ప్రస్తుతానికి మాత్రం ఎవరి ఆర్థిక పరిస్థితీ బాగాలేదు. అందువల్ల కట్టుకథ అని నా అభిప్రాయం!"

కిరణ్ సాలోచనగా చూశాడు. "...కట్టుకథ అయి ఉండవలసిన అవసరం లేదు. యుద్ధ సమయంలో ఇలాంటివి మామూలే. భయంతో ప్రజలు ఇళ్లొదిలి పారిపోవడం, వారసులు చచ్చిపోవడం, ఉన్నా స్వంత ఊరికి తిరిగి రాలేకపోవడం, ఒక్కొక్కప్పుడు సైన్యం జనాల ఆస్తి కొల్లగొట్టడం కూడా చాలా జరిగాయి. ప్రభుత్వం వారిని దండిస్తుందనే భయంతో సైనికులు వాటిని ఎక్కడో దాచడం కూడా కద్దు. అందునా వీళ్లు చదువూ, సంధ్యా పెద్దగా లేని పల్లెటూరివాళ్లు కాబట్టి ఆ భయంకొద్దీ అలాగే ఉంచి ఉండవచ్చు. ఈ రోజుల్లో కూడా డబ్బు బ్యాంకుల్లో పెట్టుకోవడానికి భయపడి, కుండల్లో పెట్టి భూమిలో దాచేవాళ్లున్నారంటే నమ్ముతారా?"

"పోన్లెండి... అది ఉన్నా, లేకపోయినా పెద్దయ్య పోవడంతో రేపు చిన్నయ్య విజిల్ ఊదుతాడు. బుల్లెయ్య జెండా ఎగరేస్తాడు. పత్రికల వాళ్లు వచ్చారని తెలిస్తే వాళ్లు మిలటరీ పోజు మరీ కొట్టేస్తారు చూడండి!"

కిరణ్ పొద్దున్న లేచేసరికి డాక్టరు కనబడలేదు. కేసు పనిమీద రాత్రి బయటకు వెళ్లారని, తనకోసం ఆగకుండా టిఫిన్ తినేయమన్నారనీ నౌకరు చెప్పాడు. అతను టిఫిను ముగించేలోగానే డాక్టరు తిరిగి వచ్చాడు. కేసు మరెవరిదో కాదు, బుల్లెయ్యదిట.

"నాకు అరవై దాటాయండీ, కిరణ్‌గారూ! నలభై ఏళ్ల ప్రాక్టీసు, చుట్టపట్ల ఊళ్లల్లో నా హస్తవాసి మంచిదని మంచి పేరుంది. కానీ ఇప్పటిదాకా భగవంతుడి లీల అర్థం చేసుకోలేకపోతున్నాను. నెల్లాళ్లకు మించి బతకదురా వీడు అనుకున్నవాడు ఏళ్ల తరబడి లాగించేస్తాడు. వీడికి ఇంకా పదేళ్లదాకా ఢోకా లేదురా అనుకున్నవాడు వారం తిరక్కుండా బాల్చీ తన్నేస్తాడు. వాడిని నిలిపే శక్తి ఏదో, వీడిని ఎగరేసుకుపోయే శక్తి ఏదో ఆ భగవంతుడికే తెలియాలి!"

"...రాత్రి బుల్లెయ్యకేమైనా అయిందా?" ఆదుర్దాగా అడిగాడు కిరణ్.

"మీరు పడుకున్న పది నిమిషాలకు కాబోలు బుల్లెయ్య మనవరాలు సీత పరిగెత్తుకు వచ్చింది. 'మా తాత పడిపోయాడు, వచ్చి చూడండి' అంటూ. వెళ్లి చూద్దును కదా, బ్రెయిన్ హెమరేజ్. కడుపు నింపుకోవడానికి డబ్బు లేకపోయినా, మిగిలిన ఏకైక మనవరాలికి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట లేకపోయినా, దానికి పెళ్లి అయ్యే అవకాశం కనుచూపు మేరలో లేకున్నా పట్టించుకోకుండా బేఫర్వాగా ఉండే బుల్లయ్యకు రక్తపు పోటు వస్తుందనీ, సడెన్‌గా హెమరేజ్ వస్తుందనీ ఎవడూహించగలడు చెప్పండి? రాత్రంతా మందు మీద మందు ఇస్తూనే ఉన్నాను. మాట దక్కించాడు కాదు, ఆరు గంటలకు ముందే తల వాల్చేశాడు."

"అయ్యో పాపం, మరి ఇవాళ ఫంక్షన్ చేస్తారా?" ఆదుర్దాగా అడిగాడు కిరణ్. అతనప్పుడే సగం రిపోర్టు రాసి పెట్టుకున్నాడు.

"తప్పకుండా చేస్తాం, ఇద్దరు వీరుల స్మృతికి ఘనంగా నివాళులర్పిస్తాం. కానీ పతాకం ఎగరేసేందుకు బుల్లెయ్య లేదు కాబట్టి, అది కూడా చిన్నయ్యనే ఎగరేయమంటాం."

చిన్నయ్యను చూస్తే కిరణ్‌కి అనుమానం వచ్చింది. ఈ మనిషి వచ్చే ఏడాది ఉత్సవం దాకా బతికి ఉంటాడా అని. ఒక చెవి అస్సలు వినబడదు.

కిరణ్ పత్రికాఫీసు నుండి వచ్చాడని వినగానే ముసిముసి నవ్వులు నవ్వి, "ఎక్కణ్ణుంచి కొట్టుకొచ్చావ్?" అని అడిగాడు డాక్టరును.

"పెద్దయ్య, బుల్లెయ్య పోయారు కాబట్టి ఇప్పుడు మీరేగా ఆ నిధికి వారసులు. ఆ డబ్బు ఏం చేస్తారు?" అని అడిగాడు కిరణ్.

ముసలాడు నవ్వాడు. "అప్పుడే నీ దాకా వచ్చిందీ! డబ్బు ఉందని నీకు గ్యారంటీగా తెలుసన్నమాట! మరి ఆ డబ్బు దేనిలో వేస్తే మంచిదో నువ్వే సలహా చెప్పు!" అన్నాడు వెక్కిరింతగా. అంటూనే, "అవన్నీ చూసుకోవడానికి మా మనవడు సూర్యం ఉన్నాడు. ఏదైనా అనుభవించేది ఉందంటే వాడే అనుభవించాలి. ఈ వయస్సులో నేననుభవించేది ఏముంది నా బొంద!" అని చేర్చాడు.

'అమ్మో, ముసలితనం వచ్చినా టక్కరితనం పోలేదు' అనుకున్నాడు కిరణ్. సూర్యంకేసి చూశాడు. అతను మొహం చిట్లించాడు. నలుగురు పిల్లలున్నారట. వాళ్లని పోషించడం కష్టంగా ఉందేమో. బీదరికం అనుభవిస్తున్నట్టే ఉన్నాడు. ముసలాడి సరసం అతనికి నచ్చలేదు. 'వాళ్ల ముగ్గురి మధ్య ఈ ఎగ్రిమెంట్లేమిటి కథల్లోలా? హాయిగా పంచుకుని అనుభవించక!" అని అతని అభిప్రాయమేమో!

ఫంక్షన్ జరుగుతుండగా బుల్లెయ్య మనవరాలు సీత పక్కసీట్లో కూర్చున్నాడు కిరణ్. "ఆ నిధి గురించి మీ తాత ఏమైనా చెప్పాడా?" అని అడిగాడామెను.

"ఆహాఁ... బోల్డుసార్లు చెప్పాడు. ఒకసారి చెప్పింది మరోసారి చెప్పకుండా... అంతా బూటకం అని నా ఉద్దేశ్యం."

"ఎక్కువసార్లు చెప్పిన విషయం ఏమిటి?"

"ఏం? పేపరులో వేస్తారా? అయితే వినండి. మా తాత చెప్పినదేమిటంటే ఈ ముగ్గురూ మిలటరీలో ఉండగా, సైన్యం బర్మాను ఆక్రమించుకున్నప్పుడు ఒక బంగళా నేలమాళిగలో బోల్డంత నిధి కనబడిందట. అప్పుడు తీసుకుంటే పై అధికారులు దండిస్తారని భయపడి, అది ఎవరికీ తెలియకుండా మూసేశారట. యుద్ధం అయిపోయాక, ఆర్మీలోంచి బయటకు వచ్చేశాక ముగ్గురూ బర్మా వెళ్లి ఆ ఇంట్లో నిధిని తరలించుకుని వచ్చి ఈ ఊళ్లోనే దాచుకున్నారట. ముగ్గురూ దరిద్రంలో బతుకుతున్నా, మరి ఆ నిధి ఎందుకు బయటకు తీయరో బ్రహ్మదేవుడికి తెలియాలి. అందుకే అంతా బోగస్ అని నాకు అనుమానం."

"బోగస్ అయి వుండకపోవచ్చు. ముగ్గురూ మిలటరీ వాళ్లు. పల్లెటూరివాళ్లు. వాళ్లకుండే చాదస్తాలు వాళ్లకుంటాయి. ఒట్టేసుకున్నారుగా, అది మీరడానికి భయం కావచ్చు. అయినా ఈ ఫంక్షన్ అయిపోగానే చిన్నయ్య ఆ నిధిని ఎలాగూ బయటకు తీయబోతాడు. అప్పుడు అందరి అనుమానాలూ తీరిపోతాయి!" అన్నాడు కిరణ్.

కానీ చిన్నయ్య ఫంక్షన్ పూర్తయ్యేలోపునే పోయాడు. విజిల్ ఊదుతూండగానే అతని కంఠనాళాలు ఉబ్బాయి. కొద్ది సెకండ్లలోనే అతని మొహం నీలంగా మారిపోయింది. అలానే కుప్పకూలిపోయాడు. ఊరు యావత్తూ అతనిచుట్టూ మూగారు.

కొద్ది నిమిషాలలోనే అందరికీ తెలిసిపోయింది విజిల్‌కి విషం పూయబడిందని. క్రితం సంవత్సరం పెద్దయ్య కూడా ఇలాంటి విషప్రయోగానికే గురయ్యాడని అందరికీ గుర్తుకువచ్చింది. డాక్టరు పోస్టుమార్టమ్ చేస్తానంటే వద్దన్నందుకు వారించిన వారంతా విచారించడం మొదలుపెట్టారు. శవాన్ని అలాగే ఉంచి, పోలీసులను పిలవమన్నాడు డాక్టరు.

"చిన్నయ్య పోతేపోయాడు కానీ ఇప్పుడిక ఆ నిధికి వారసుడివి నువ్వే కదా!" అని సూర్యాన్ని అభినందించారు కొందరు.

"నిధి మాట అలా ఉంచండి, ముందు దానికోసం మా తాతను చంపానని పోలీసులు అనకుండా ఉంటే అంతే చాలు!" అన్నాడు సూర్యం పెదవి విరిచి.

"అంటే మీ తాత చావుకి నీకూ ఏ సంబంధం లేదంటావా?" అడిగాడు డాక్టరు.

"అదేంటండి? అలా అంటారూ?" అన్నాడు సూర్యం నివ్వెరపోతూ.

"ఆ విజిల్ క్రితం సంవత్సరం వరకూ పెద్దయ్య ఇంట్లోనే ఉండేది. అతను పోవడంతో మీ ఇంటికి వచ్చింది. దానికి విషం పూసింది నువ్వు కాదూ! ఆ ముగ్గురిలో ఆఖరి వారసుడు మీ తాత. అతని ఏకైక వారసుడివి నువ్వు. అందుచేత ఆ నిధి నీకే దక్కుతుందని..."

"సార్! ఇది అన్యాయం. ఆ విజిల్ ఏడాది పొడుగునా హాలు గోడ మేకుకు వేళ్లాడుతూనే ఉంది. ఎవరైన వచ్చి విషం పూసి ఉండవచ్చు. మా తాతే ఆస్తికోసం పెద్దయ్యను చంపి, ఆ విజిల్ అలాగే ఉంచేశాడేమో! ఎవరికి తెలుసు? నా సంగతి కొస్తే, అసలా నిధిని నేను నమ్మితే కదా, మా తాత మీద విషప్రయోగం చేసే ఐడియా రావడం!"

"నాన్నా! చిన్నయ్య తాత ఫంక్షన్‌కి వచ్చేముందు ఈ ఉత్తరం రాసి బల్లమీద పెట్టాడు. నీ పేరు రాసి ఉంది కవరుమీద!" అంటూ పరిగెత్తుకువచ్చాడు సూర్యం రెండో కొడుకు.

డాక్టరు జబర్దస్తీగా ఆ కవరు తీసుకుని చింపి, ఉత్తరం గట్టిగా పైకి చదివాడు.

"నాయనా, సూర్యం! ఇవాళ పొద్దున్నే తెలిసింది బుల్లెయ్య కూడా పోయాడని. పెద్దయ్య క్రితం ఏడాదే పోయాడు. ఇక ఆ నిధికి నేనే వారసుణ్ణి. ఏ క్షణంలో ఏమవుతానో, నీకా నిధి రహస్యం చెప్పకుండానే దేవుడు తన వద్దకు రప్పించుకుంటాడో తెలియదు. అందుకే నీకు చెబుతున్నాను. ఆ నిధి ఇనుప పెట్టెలో పెట్టి పెద్దయ్య సమాధి పక్కనే పాతిపెట్టాం. నేను బతికి ఉండగా ఆ నిధి ముట్టుకునే ఉద్దేశ్యం నాకు లేదు. నేను పోయిన తర్వాత దాన్ని తవ్వి తీసుకుని నువ్వూ, భార్యాపిల్లలూ అనుభవించవలసింది. నీ తాత చిన్నయ్య."

డాక్టరు ఉత్తరం పూర్తిగా చదవకుండానే పెద్దయ్య సమాధివైపుకు జనం పరుగులు తీశారు. ఊరి పెద్దలూ వారిననుసరించారు. సూర్యం ప్రమేయం లేకుండానే ఆ ఇనుపపెట్టె బయటకు లాగడం, తెరవడం జరిగింది. అందరూ లోపలికి ఒక్కసారిగా తొంగిచూసి బిత్తరపోయారు!

దాని నిండా బర్మా దేశపు కరెన్సీ నోట్లు, ఆ కాలం నాటివి ఉన్నాయి! యుద్ధం తర్వాత వాటిని రద్దు చేయడం జరిగింది కాబట్టి అవన్నీ తుక్కు కాగితాల క్రిందనే లెక్క!

అందరికంటే ముందుగా తేరుకుని పగలబడి నవ్వినది కిరణ్. "ఈ ముసలాళ్లు దేవాంతకులు. వాళ్లకి ఆ ఇంట్లో నోట్లు కనబడడం. వాటిని వేరేచోట దాచడం కరెక్టే. యుద్ధం అనంతరం దాన్ని తీసుకోవడానికి వెళ్లినప్పుడు వాళ్లకి తెలిసివచ్చింది తమ తెలివితక్కువతనం. కానీ అది బయటపెట్టకుండా ఊరి ప్రజలమీద ఒక ప్రాక్టికల్ జోక్ వేశారు. అందరిలోనూ చివరగా మిగిలినవాడిదే ఆ సొత్తంతా అంటూ నాటకం ఆడారు!" అంటూ పడిపడి నవ్వాడు.

డాక్టరు మాత్రం నవ్వలేదు. "వాళ్ల జోక్ ఎలా ఉన్నా దాన్ని నమ్మి సూర్యం ఇద్దరు ముసలాళ్ల ప్రాణాలు బలిగొన్నాడు. అది మాత్రం క్షంతవ్యం కాదు!" అన్నాడు.

కిరణ్ సాలోచనగా పెదవి కొరుకుతూ నిలబడ్డాడు. "మనం ఒక విషయం గమనించాలి. ఈ ముసలాళ్లకి తమ నిధి విలువ ఎంతో తెలుసు. కాబట్టి ఒకరి మీద ఒకరు విషప్రయోగాలు చేసుకోవడం అసంభవం. అందుచేత పెద్దయ్యను, చిన్నయ్య చంపాడనుకోవడం అసంబద్ధం. అందువల్ల అది విలువైనదని పొరబడిన వాళ్ల వారసులే వాళ్లపై హత్యాప్రయత్నం చేసి ఉండాలి."

"కరెక్ట్! అందువల్లే అంటున్నా. చివరిగా బతికున్నవాడు చిన్నయ్య కాబట్టి అతని వారసుడు సూర్యమే ఇదంతా ప్లాను చేసి..." అనబోయాడు డాక్టరు.

"ఒక్క క్షణం, డాక్టరుగారూ! తొందరపడకండి. చివరగా బతికున్నవాడు చిన్నయ్య కావడం యాదృచ్ఛికం. ఈ రోజు ఉదయం బుల్లెయ్య సహజసిద్ధంగా చచ్చిపోకుండా ఉంటే అతనే సర్వైవరు అయి ఉండేవాడు. అలా ఆలోచిస్తే అనుమానం సీత మీదకు తిరుగుతుంది!" అన్నాడు కిరణ్.

"అంటే?"

"ముసలివాళ్లను చంపడానికి హంతకుడు లేదా హంతకురాలు ఎంచుకున్న సులభమైన మార్గం విజిల్‌కి విషం పూయడం. దాని ద్వారా పెద్దయ్యను క్రితం ఏడాదే చంపారు. ఈ ఏడాది ఆ విజిల్ ఊదేది చిన్నయ్య అని అందరికీ తెలుసు. అందుకే దానికి మళ్లీ విషయం పూయబడింది. అతనూ పోయి ఉండేవాడు. అప్పుడు మిగిలేది బుల్లయ్యేగా. ఆ ఆస్తి సీతదేగా!"

"అంటే సీతే...!" నమ్మలేనట్టు చూశాడు డాక్టరు.

"నిస్సందేహంగా. కానీ విధి విచిత్రమైన ఆట ఆడింది. బుల్లెయ్యను ఎగరేసుకుపోయింది. తను నమ్మలేదంటూనే నిధి ఉందని మనసులో నమ్మింది సీత. అందుకే ఈ ఘోరానికి ఒడిగట్టింది. ఏం సీతా, నిజమేనా?" అని అడిగాడు కిరణ్.

సీత ఏడుపే చెప్పింది, తను చేసిన పనికి ఆమె పశ్చాత్తాపపడుతోందని.